క్లుప్తంగా

దసరా సెలవులతో సొంతూళ్లకు..



ఎన్ఏడీ సెంటర్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

విశాఖ విద్య: విద్యా సంస్థలకు దసరా సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు సొంతూళ్లకు పయనయ్యారు. ఎన్ఏడీ సెంటర్ బస్టాప్‌లో బుధవారం విద్యార్థులు, వారిని తీసుకెళ్లేందుకు వచ్చిన వారితో సందడి కనిపించింది. వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సుల కోసం ఎన్ఏడీ బస్టాప్‌లో నిరీక్షించారు. ప్రయాణికులకు తెలిసేలా ఆర్టీసీ అధికారులు ఆయా రూట్ల బస్సులు వచ్చేటప్పుడు మైక్ ద్వారా ప్రచారం చేశారు.

స్థానికులకు ఉపాధి కల్పించాలని ఆందోళన

మల్కాపురం: హెచ్‌పీసీఎల్ విస్తరణ పనుల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఇండస్ట్రియల్ ఏరియా శ్రామిక శక్తి లేబర్ వర్కర్స్ అసోసియేషన్ ప్రతినిధి పెద్దిరెడ్ల నానాజీ డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనియన్ ప్రతినిధులు,సభ్యులు బుధవారం కార్మికులను విధులకు వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. నానాజీ మాట్లాడుతూ విస్తరణ పనుల్లో కాంట్రాక్టర్లు స్థానికేతరులకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. దీని వల్ల స్థానిక యువత ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన చెందారు.యాజమాన్యం స్పందించక పోవడంతో కార్మికులను అడ్డుకోవాల్సి వచ్చిందన్నారు.

వెయ్యిమందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో పాల్గొన్న నేవీ అధికారులు

సింథియా: నేవీ డే సెలబ్రేషన్స్‌లో భాగంగా తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో తమిళనాడులోని కారైకల్ పోర్ట్‌లో ఉన్న ఐఎన్ఎస్ ఘరియాల్‌లో పోర్టబుల్ కంటైనరైజ్డ్ మల్టీస్పెషాలిటీ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని తమిళనాడు కమాండింగ్ ఫ్లాగ్ ఆఫీసర్ రియర్ అడ్మిరల్ ఆర్‌కే ధింగ్రా ప్రారంభించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన వైద్య శిబిరంలో 50 మంది ఎన్‌సీసీ క్యాడెట్‌లు, కారైకల్‌కు చెందిన 30 మంది నర్సులు సేవలందించారు. కారైకల్ చుట్టుపక్కల నివసించే మహిళలు, పిల్లలు సహా సుమారు 1000 మంది వైద్య సేవలు పొందినట్లు అధికారులు తెలిపారు.

అమృత్ ఉద్యానవనానికి మట్టి సేకరణ



వస్త్రంపై సేకరించిన మట్టిని వేస్తున్న బెహరా విజయచైతన్య

గోపాలపట్నం: ఢిల్లీలో నిర్మించే అమృత్ ఉద్యానవనానికి బుధవారం బెహరా కళాశాలలో మట్టి సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండర్ సనత్‌కుమార్ పటేల్ మాట్లాడుతూ అమృత్ కలాస్, అమరవీరుల స్మారకార్థం మట్టి వినియోగిరచేదుకు సేకరిస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ, హోం శాఖ, నెహ్రూ యువజన కేంద్ర సంఘటన్ ఉమ్మడి విశాఖ జిల్లాలో ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. బెహరా విద్యా సంస్థలో నా మట్టి.. నా దేశం కార్యక్రమం ద్వారా మట్టి సేకరించామని చెప్పారు. బెహరా విద్యా సంస్థల డైరెక్టర్ బెహరా విజయచైతన్య మట్టిని సేకరించి సనత్‌కుమార్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం మా విద్యా సంస్థల్లో జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. జిల్లా యువజన శాఖ అధికారి మహేష్, ఎన్ఎస్ఎస్ నేషనల్ అవార్డు గ్రహీత ఆర్‌లీలా ప్రసాద్‌రెడ్డి, సామాజిక కార్యకర్త నరసింహం, అధ్యాపకులు పాల్గొన్నారు.

జగనన్న రక్ష ..ఆరోగ్య సురక్ష



బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది



బుచ్చిరాజుపాలెంలో వైద్య సేవల కోసం వచ్చిన రోగులు

- చెంతకే స్పెషలిస్టు వైద్యులు
- వైద్య సేవలు పొందేందుకు క్యూ కడుతున్న జనం

విశాఖ విద్య: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు ప్రజలు క్యూ కడుతున్నారు. చెంతనే వైద్య సేవలు అందడంతో పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. వైద్య సిబ్బంది ముందుగా ఇంటింటికీ వెళ్లి ఇచ్చిన ఓపీలతో పాటు వారికి కేటాయించిన రోజు శిబిరాలకు వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. పశ్చిమ నియోజకవర్గంలో ఈ శిబిరాలకు విశేష స్పందల లభిస్తోంది. వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తున్నారు. అవసరమైన వారిని మెరుగైన వైద్యం కోసం సిఫార్సు చేస్తున్నారు. కళ్లద్దాలు కూడా ఉచితంగా అందిస్తున్నారు.

మూడో రోజూ అదే స్పందన

జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం సెయింట్ ఆన్స్ పాఠశాలలో మూడో రోజు బుధవారం నిర్వహించిన శిబిరంలో ని బుచ్చిరాజుపాలెం -3 సచివాలయం పరిధిలోని ప్రజానీకం వైద్య సేవలకు



రోగులకు సురక్ష కిట్ అందిస్తున వైద్యాధికారి సాయిరూప,పుర్రె సురేష్‌యాదవ్

తరలివచ్చారు. దంత, కంటికి సంబంధించిన పరీక్షలు చేయించుకునేందుకు విద్యార్థులు సైతం ఎక్కువగా వచ్చారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ సహకారంతో రుచికరమైన భోజనం అందించారు. వైద్యసేవలు పొందేందుకు వచ్చిన ప్రతీ ఒక్కరూ భోజనం చేసి వెళ్లేలా నమ్మి శ్రీను ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.



మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది



వైద్య శిబిరంలో సిబ్బందితో డాక్టర్ శాంతి

245 మందికి వైద్య పరీక్షలు

కంచరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తుందని జోన్-5 కమిషనర్ ఆర్జీవీ కృష్ణ అన్నారు. తుమ్మడపాలెం సచివాలయం పరిధిలో వారికి భవాని గార్డెన్స్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. జీవీఎంసీ 57వ వార్డు కార్పొరేటర్ ముర్రువాణి నానాజీ వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు. 245 మంది రోగులకు పలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు డాక్టర్ శాంతి తెలిపారు. ఆడారి తులసీ రావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రోగులకు, వైద్య సిబ్బందికి భోజన అందించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పల్లా ఎర్నికుమార్, నాయకులు నానాజీ, శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

59వ వార్డులో..

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు ములగాడ హౌసింగ్‌కాలనీలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం కూడా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ సాయిరూప సిబ్బందితో కలిసి 120 మందికి వైద్య సేవలందించారు. పారిశ్రామిక ప్రాంత ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, నాయకులు పెంటారావు,పార్టీ వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ,అమరావతి తదితరులు సహాయసహకారాలు అందించారు.

మంచి వైద్యం



ప్రైవేటు ఆస్పత్రికి కంటే ఇక్కడే మంచి వైద్య సేవలు అందాయి. బీపీ, సుగర్ పరీక్షలు చేయించుకున్నాను. ప్రైవేటు ఆస్పత్రికి వెళితే ఇలాంటి పరీక్షలకే వెయ్యి రూపాయల వరకు బిల్లు వేస్తారు. మా దగ్గరకే స్పెషలిస్టులు వైద్యులను తీసుకొచ్చి వైద్య పరీక్షలు చేయించి, మందులు ఇచ్చి పంపించడం గొప్ప విషయం.

– పిల్లి సూర్యదోస రెడ్డి, బుచ్చిరాజుపాలెం

మా ఇంట్లో అంతా వచ్చాం



మా కాలనీకి స్పెషలిస్టు డాక్టర్లు వచ్చారు. అందుకే ఇంట్లో అందరం వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నాం. ఒంట్లో నలతగా ఉందంటే మందులు ఇచ్చారు. నా భర్త కూడా బీపీ, సుగర్ పరీక్షలు చేయించుకున్నాడు. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలంటే వేలకు వేలు ఖర్చు అవుతుంది.

– బల్లంకి చిట్టమ్మ, ఏపీఎస్ఈబీ కాలనీ

ఎంతో మేలు



దూరాభారం వెళ్లి వైద్యం చేయించుకోలేని మాలాంటోళ్లకు వైద్య శిబిరం వల్ల ఎంతో మేలు. పెద్ద డాక్టర్లు వస్తున్నారని మా వలంటీరు చెబితే వచ్చాను. కళ్లు మసకగా ఉంటున్నాయని చెబితే పరీక్ష చేసి మందులు ఇచ్చారు. పెద్దాస్పత్రికి వస్తే ఆపరేషన్ కూడా చేస్తామని చిట్టీ రాసి ఇచ్చారు. అన్నీ ఉచితంగానే చేస్తున్నందుకు సంతోషంగా ఉంది.

– కసిరెడ్డి సింహాచలం, లక్ష్మీనగర్

డ్వాక్రా మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

సింథియా: పొదుపు సంఘాల మహిళల(డ్వాక్రా మహిళల) ఆర్థికాభివృద్ధికి ఆర్పీలు కృషి చేయాలని జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు పేర్కొన్నారు. అంబేడ్కర్‌కాలనీలోని కార్యాలయంలో బుధవారం ఆర్పీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. మునుపెన్నడూ లేని విధంగా అనేక సంక్షేమ కార్యక్రమాల ద్వారా మహిళలకు ఆర్థిక తోడ్పాటు అందిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమన్నారు. సంక్షేమ పథకాలు అర్హులైన పేదలందరికీ చేరేలా చూడాలని



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సూచించారు. మిగిలిన అర్హులను కూడా గుర్తించి పథకాలకు దరఖాస్తు చేయించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు బీశెట్టి గణేష్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు శ్రావణ్, శ్రీకాంత్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాలక మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో పోటీపడేలా..!

- రాణిస్తున్న ఎన్ఏడీ కేవీ విద్యార్థులు
- నూరుశాతం ఫలితాలతో గుర్తింపు



ఎన్ఏడీ కేంద్రీయ విద్యాలయం



వాలీబాల్ ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులు



పచ్చదనంతో ఉన్న గార్డెన్



విశాలమైన పాఠశాల ప్రాంగణం

విశాఖ విద్య: ఎన్ఏడీ కేంద్రీయ విద్యాలయం జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఇక్కడి విద్యార్థులు చదువుల్లో రాణిస్తున్నారు. దీంతో సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ సిలబస్‌తో నిర్వహిస్తున్న ఈ విద్యాలయంలో ప్రవేశాలకు విద్యార్థులు పోటీపడుతున్నారు.

1,436 మందితో కళకళ

బాలవాటిక(ఎల్‌కేజీ) నుంచి పన్నెండో తరగతి వరకు ఇక్కడ 1,436 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఎన్ఏడీ కూడలి చుట్టూ ఉన్న కేంద్ర ప్రభుత్వ సంస్థలు, కర్మాగారాల్లో పనిచేసే ఉద్యోగులు ఎక్కువగా తమ పిల్లలను ఇందులో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ఏటా అడ్మిషన్ల కోసం విపరీతమైన పోటీ ఉంటుంది. మెరిట్ మేరకు విద్యార్థులకు ఇక్కడ ప్రవేశాలు కల్పించేలా విద్యాలయ నిర్వాహకులు శ్రద్ధ తీసుకుంటున్నారు.

బాలవాటికతో పటిష్టమైన పునాది

ఎన్ఏడీ కేంద్రీయ విద్యాలయంలో బాలవాటిక(ఎల్‌కేజీ) నుంచే ప్రవేశాలు కల్పిస్తున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో ఎల్‌కేజీ చదువులకు లక్షల్లో ఫీజులు వసూలు చేస్తుండడంతో ఇంగ్లిష్ మీడియం అందుబాటులో ఉన్న ఈ కేవీ వైపు విద్యార్థుల తల్లిదండ్రులు చూస్తున్నారు. నిష్ణాతులైన అధ్యాపకులు ఉండడంతో నైపుణ్యంతో కూడిన చదువులు అందుతున్నాయి. ఏటా నిర్వహించే 10, పన్నెండో(ప్లస్-2) తరగతుల్లో కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధిస్తున్నారు.

క్రీడల్లో సత్తా

చదువుతో పాటు విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా కేంద్రీయ విద్యాలయ ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇక్కడి విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటారు. విశాలమైన క్రీడామైదానంలో అందుబాటులో ఉండడంతో విద్యార్థులకు ఆసక్తి ఉన్న క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇటీవల ప్రధాన నరేంద్రమోదీ విద్యార్థులతో నిర్వహించిన పరీక్ష పే చర్చలో ఇక్కడి విద్యార్థులు పాల్గొన్నారు. తద్వారా ప్రశంసా పత్రాలు పొందారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం



విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. అధ్యాపకులు విద్యార్థులను తమ సొంత బిడ్డల్లా చూసుకుంటూ చదువు చెబుతుండడంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. పరీక్ష పే చర్చలో పాల్గొన్న విద్యార్థులకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నుంచి ప్రశంసా పత్రాలు వచ్చాయి. వాటిని విద్యార్థులకు అందించే ఏర్పాట్లు చేస్తున్నాం.

– ఎస్.నాగేంద్రకుమార్, ప్రిన్సిపాల్

అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ



అన్నపూర్ణాదేవిగా దుర్గాలమ్మ



కలశ పూజల్లో పాల్గొన్న భక్తులు



కరెన్సీ నోట్ల అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు



కరెన్సీ నోట్లతో అలంకరణలో దుర్గమ్మ



గొల్లకంచరపాలెంలో శాకంబరి అలంకరణలో ధనలక్ష్మీ దేవి

విశాఖ విద్య: శ్రీదేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలోని శ్రీ దుర్గాలమ్మ-బంగారమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం అమ్మవారు అన్నపూర్ణగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన కలశపూజలో మహిళా భక్తులు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహక కమిటీ అధ్యక్షుడు బుజ్జి, కార్యదర్శి జగన్, కుమార్, గోపి , సతీష్‌ల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

కరెన్సీ నోట్ల అలంకరణలో ఎర్నిమాంబ

కంచరపాలెం : జ్ఞానాపురంలో వేంచేసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ అవరణలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ, ఆలయ సిబ్బంది ప్రసాద్, అప్పలరాజు, ఉత్సవ కమిటీ సభ్యులు పనులు పర్యవేక్షించారు.

మల్కాపురం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 58వ వార్డు ఎదురవానిపాలెంలో దుర్గాదేవి అమ్మవారిని బుధవారం ధనలక్ష్మిగా అలంరించారు. వివిధ కరెన్సీ నోట్లను అమ్మవారి మండపం చుట్టూ అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సాయింత్రం పీఠం వద్ద భవానీ మాలధారులు అమ్మవారి ఘటాలను పుర వీధుల్లో కీర్తనలు ఆలపిస్తూ ఊరేగించారు.

- 61వ వార్డు మల్కాపురం యాదవ వీధిలో శ్రీవిజ్ఞాన మండలి యాదవ సంఘం వద్ద భవానీ మాలధారులు ప్రతిష్ఠించిన దుర్గాదేవి అమ్మవారిని ధనలక్ష్మి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మండపంలో రూ.20, రూ.50, రూ.100, రూ.500 రూపాయల నోట్లు, కొత్త చిల్లర నాణేలను అలంకరించారు.
- మల్కాపురం యాదవ వీధిలో అల్లరి యూత్ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో శ్రీదేవి చారిటిబుల్ ట్రస్టు అధినేత కోరాడ శ్రీను పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

శాకంబరిగా ధనలక్ష్మీదేవి

కంచరపాలెం: గొల్లకంచరపాలెం ధనలక్ష్మీదేవి ఆలయంలో బుధవారం అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. అన్ని రకాల కూరగాయలతో ధనలక్ష్మీదేవి నిండుగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు శ్యామాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, తేనెతో అభిషేకాలు నిర్వహించారు. శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు.

ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం



స్వర్ణ జయంత్యుత్సవ లోగోను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

డాబాగార్డెన్స్ : ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ విశాఖ డివిజన్ ఏర్పడి బుధవారం నాటికి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా డివిజినల్ కార్యాలయం ఆవరణలో యూనియన్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షురాలు మల్లాది కామేశ్వరి, కార్యదర్శి వరప్రసాదరావు మాట్లాడుతూ గత ఐదు దశాబ్దాలుగా కార్మిక సంక్షేమానికి, సభ్యుల అభ్యున్నతికి పని చేస్తున్నట్లు తెలిపారు. 1974 అక్టోబర్ 18న మచిలీపట్నం డివిజన్ నుంచి విశాఖపట్నం డివిజన్ ఏర్పడిందన్నారు. 74లో ప్రెసిడెంట్‌గా పని చేసిన రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యుడు ఎన్. కృష్ణమూర్తి మాట్లాడుతూ సంస్థ ఉన్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా స్వర్ణ జయంత్యుత్సవ లోగో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పౌష్టికాహార స్టాల్



స్టాల్‌లో ప్రదర్శించిన పప్పు దినుసులు

విశాఖ విద్య:జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో స్త్రీ శిశు సంక్షేమశాఖ ద్వారా ఏర్పాటు చేసిన స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బుచ్చిరాజుపాలెం-3 సచివాలయం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు ఇక్కడ విధుల్లో పాల్గొన్నారు. కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను వివరిస్తూ పౌష్టికాహార సామగ్రిని స్టాల్‌లో ప్రదర్శించారు. వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు నమ్మి శ్రీను, ఐసీడీఎస్ మల్కాపురం సెక్టార్ సూపర్ వైజర్ వరలక్ష్మి స్టాల్‌ను సందర్శించారు.

మూక్ కోర్సులు విద్యార్థులకు ఉపయుక్తం



ఆచార్య విమల్ రాహ్‌ను సత్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి తదితరులు

ఏయూక్యాంపస్: మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సులు (మూక్స్) విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తున్నాయని ఢిల్లీలోని ఎస్‌జీటీబీ ఖల్సా కళాశాల రసాయనశాస్త్ర ఆచార్యురాలు విమల్ రాహ్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర విభాగాన్ని బుధవారం సందర్శించిన ఆమె విద్యార్థులనుద్దేశించి ప్రత్యేకంగా ప్రసంగించారు. అనంతరం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వర్సిటీలో అందిస్తున్న కోర్సులు, స్టార్టప్, ఇంక్యుబేషన్ తదితర అంశాలను వీసీ వివరించారు. ఆచార్య విమల్ రాహ్ మాట్లాడుతూ ఈ లెర్నింగ్ విద్యార్థులకు సులభతరంగా నిలుస్తోందన్నారు. విద్యార్థులు అభ్యసిస్తున్న కోర్సుతో పాటు విభిన్న శాస్త్ర అంశాలను నేర్చుకోవడానికి, నూతన జ్ఞానాన్ని పొందడానికి ఇవి ఉపయుక్తంగా నిలుస్తున్న విధానాన్ని వివరించారు. యూజీసీ నిర్వహించిన ఒక ప్రాజెక్టులో భాగంగా తాను ఇ-కంటెంట్‌ని రూపకల్పన చేసి ఇచ్చిన విధానం తెలియజేశారు. దేశవ్యాప్తంగా ఉన్న నిపుణులైన ఆచార్యుల సహకారంతో విభిన్న శాస్త్ర అంశాల్లో ఈ-కంటెంట్‌ను అభివృద్ధి చేసి అందిస్తే విద్యార్థులకు ఎంతో ఉపయోగపడగలదన్నారు. ఉన్నత మానవ వనరులు, మౌలిక వసతులు కలిగిన ఏయూ ఈ దిశగా ముందడుగు వేయాలని సూచించారు. కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగాధిపతి ఆచార్య పి.శ్యామల, స్వయం నోడల్ అధికారిణి ఆచార్య కె.రమాసుధ, ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

సెయిల్‌తో సమానంగా బోనస్ చెల్లించాలి

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో బుధవారం మహాధర్నా నిర్వహించారు. బుధవారం ఉదయం ఉక్కు బీసీ గేటుకు ఇరువైపులా కార్మికులు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. వైఎస్సార్ టీయూసీ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప మాట్లాడుతూ సెయిల్‌తో సమానంగా బోనస్ చెల్లించాలని అలాగే గతేడాది ఇవ్వకుండా నిలిపివేసిన రూ.9500 ఈ బోనస్‌లో కలిపి చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, పిట్టా రెడ్డి, కర్రి దాలినాయుడు, ఎన్నేటి రమణ, నక్క వెంకటరమణ, అండిబోయిన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

భిక్షాటన పేరుతో డబ్బులు డిమాండ్

మల్కాపురం: భిక్షాటన పేరుతో స్థానికులను ఇబ్బంది పెడుతున్న కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకుని హెచ్చరించి వదిలిపెట్టారు. 61వ వార్డు మల్కాపురంలోని పలు వీధుల్లో కొంత మంది మహిళలు బుధవారం ఉదయం గుంపుగా సంచరించారు. దుర్గాదేవి అమ్మవారి ప్రతిమను తలపై పెట్టుకుని ఇళ్ల ముందు నిలబడి భిక్షాటన పేరుతో ఎంతో కొంత ఇవ్వాలని డబ్బులు డిమాండ్ చేశారు. ఇంటి ముందు నుంచి కదలకుండా ఇబ్బంది కలిగించేలా ప్రవర్తించడంతో విసుగు చెందిన నివాసులు మల్కాపురం పోలీసులకు సమాచారమిచ్చారు. వారు వచ్చి విషయం తెలుసుకుని ప్రజలను ఇబ్బంది పెడుతున్న గుంపును జీపులో స్టేషన్‌కు తరలించి విచారించారు. మళ్లీ ఇలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించి విడిచిపెట్టారు.